# ఆడవాళ్లూ! పంపుతిప్పే పాతపద్ధతి మానెయ్యండి!

మేనక ఆఫీసులో చేరి ఉద్యోగం చెయ్యడం మొదలెట్టి ఇరవై ఏళ్లు దాటినా, ఇసుమంతైనా మారలేదు ఆమె ప్రవర్తన! తనని తాను అందరికంటే ఎక్కువగా అంచనా వేసుకుని అందరూ తన ముందు తీసికట్టుగా తనకి తానే భావించి ఎవ్వరితోటీ కలవకుండా మాట్లాడకుండా తనకితాను గిరి గీసుకుని కూర్చుంటుంది. అంతటితో ఆగితే గొడవలేదుగా! తనకి ఎవ్వరూ పని చెప్పకూడదు పై ఆఫీసరు తప్ప! ఒకవేళ మధ్యలో వాళ్లెవరయినా వచ్చి ఏదైనా పని చెబితే "మీరెవరు నాకు చెప్పడానికి?" అని దబాయించి పారేసేది. ఆమె అలా మాట్లాడినప్పుడు పెద్ద మనుషులైతే బాధపడేవారు. మరోసారి ఆమెతో మాట్లాడడానికి ఇష్టపడే వారు కాదు. కానీ ఆమెతోటి వయస్కులు, యువకులూ, పౌరుషాన్నాపుకోలేక తిరగబడేవారు. అలా తిరగబడేసరికి నల్లా తిప్పేసేది మేనక. అంతటితో ఊరుకోకుండా పై అధికారుల దగ్గరికెళ్ళి వెక్కి వెక్కి ఏడ్చేది! దాంతో పై అధికారులు జాలినంతా మేనకపైన గుప్పేసి, కోపాన్నంతా ఇతరులపైన చూపించేవారు. దాంతో యుద్ధంలో విజయం సాధించిన వీర వనితలా, మళ్లీ నవ్వుతూ తుళ్లుతూ తిరిగేది మేనక.

'ఇంటికంటే గుడి పదిలం' అన్న సామెత అక్షరాలా నిజమయింది మేనక విషయంలో. మేనకకి ఇంట్లో తల్లిదండ్రుల దగ్గరగానీ, భర్త దగ్గరగానీ తన ముద్దు ముద్దు మాటలతో, మురిపాలు తీర్చుకోవడానికి అవకాశం దొరకలేదు. అది ఆఫీసులో దొరకడం ఆమె అదృష్టంగా భావించింది. భర్త ఆనంద్‌కి మేనకకాక మరో భార్య ఉంది. కొత్తలో మేనక కోర్కెలు విని ఆమె చేసే ఫిర్యాదులు విని ఆమెని ఊరడించేవాడు. కానీ నలుగురు పిల్లలు పుట్టినా ఆమె ప్రవర్తనలో ఏ విధమైన మార్పు రాకపోవడం, అందరితోపాటు అతనికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. నలభయ్యోపడిలో పడుతూ ఎదుగుతూన్న బిడ్డల ముందు తను పసిపిల్లలా

ముద్దుముద్దు (కాదు ముద్ద ముద్ద) మాటలతో మాట్లాడడం అందరికీ అసహ్యంగా అనిపించేది. "వయస్సుకి తగ్గ ప్రవర్తన మేనకలో లేదు. ఆమె ఇంకా చిన్న పిల్లలా ప్రవర్తించడం, ఆమె అందరికన్నా గొప్పదాన్నని ఊహించుకోవడం ఇదంతా వింతగా అనిపిస్తుంది కదూ" అంది వినతి మైథిలితో.

"అదే! నన్నడిగితే మేనకకి సైక్రియాటిస్ట్ ట్రీట్ మెంట్ కావాలి! ఆమె ఎదగడం ఏ పద్దెనిమిదో ఏటో ఆగిపోయింది. అనవసరంగా ఆమెనని లాభం లేదు" అంది మైథిలి. ఆ మాట విన్న మేనక మైథిలి జుట్టు పట్టుకుంది. "దొంగము... లం.. ము..." అంటూ నోటికొచ్చినట్టల్లా తిట్టడం మొదలెట్టింది. ఆ తిట్లు వింటూంటే అది 'ఆఫీసా మోండా మార్కెట్టా' అన్న అనుమానం వస్తుంది. కానీ ఎవ్వరూ సాహసించి మేనకని ఏమీ అనలేకపోయారు. కారణం ఆవిడ పై ఆఫీసరు దగ్గరకెళ్ళి పంపు తిప్పేస్తుందని ఆవిడ కన్నీళ్ళకి కరిగిపోయి ఆ ఆఫీసరు మహానుభావుడు వాళ్లని ఆమె ముందే చీవాట్లెయ్యడం జరుగుతుందని ఎవరికి వారే మాట్లాడక ఊరుకున్నారు. అందరూ అలా ఊరుకోవడం కూడా ఆమె సహించలేక పోయింది. తన ఉనికినే అందరూ నిర్లక్ష్యం చేస్తూన్న భావం కలిగింది ఆమెలో! లేని దగ్గు తెచ్చుకుని దగ్గడం మొదలెట్టింది. అయినా ఎవ్వరూ తిరిగి చూడలేదు. "జ్వరం వొచ్చినట్టుగా వుంది" అంటూ మూలగడం మొదలెట్టింది. అయినా ఎవరూ తిరిగి చూడలేదు. మరీ పట్టలేక ఏదో సణుక్కుంటూ ఏడవడం మొదలెట్టింది"

ఇదంతా దూరంనుంచి చూస్తున్న అమర్ నాథ్ మేనక పక్కనే కూర్చున్న ఏసుపాదాన్ని చూసి "ఏమోయ్! పొరుగువాళ్లు బాధపడుతూ వుంటే మరీ బొత్తిగా పట్టించుకోకపోవడం ఏమీ బాగులేదోయ్!" అన్నాడు నవ్వుతూ.

"ఇంట్లో నా భార్యతోటే చచ్చిపోతున్నాను. ఆఫీసుకొచ్చి ఆ విషయాలు కాస్సేపు మర్చిపోదామంటే ఇదేం సొదరా బాబూ! ఆఫీసు ఇల్లూ రెండూ కాక ఇంకెక్కడికయినా ఆడవాళ్లు లేని చోటికి పారిపోవాలనుంది!" అన్నాడు ఏసుపాదం.

"ఆడవాళ్లకీ... ఉద్యోగాలిస్తే... ఇల్లాగే వుంటుంది బై.. హు అంటే

ఏడుస్తదీ.. హా... అంటే ఏడుస్తాదీ... వో లోగ్... నౌకరీ చేసే దానికి... పనికీరారూ భాయ్!" అన్నాడు మహమూద్.

వీళ్ల మాటలకి ఉడుకుమోతుతనం మరీ ఎక్కువైంది మేనకకి!

"అప్పటినుంచీ చూస్తున్నాను మీ ఇద్దర్నీ. ఇష్టం వొచ్చినట్టు మాట్లాడుతున్నారు. ఏమయ్యా మహమూదు నేను చేసేంత పని నువ్వు చేస్తున్నావా? మాట్లాడవేం? బ్రూట్" అంది పళ్లు కొరుకుతూ.

"బ్రూట్" అనగానే అరికాలిమంట నెత్తి కెక్కింది మహమూద్ భాయ్‌కి!

"వొళ్లు దగ్గరుంచుకుని మాట్లాడు" అంటూ చేతులెత్తాడు. దాంతో మేనక గొంతు ఆరున్నరశృతి పలికింది. అందరూ పోగయ్యారు.

కొందరు మేనకది తప్పన్నారు. కొందరు మహమూద్ భాయిది తప్పన్నారు. ఏది ఏమైతేనేం ఆరోజంతా గోలగోల! సమయానికి ఆఫీసరుగారు ఊర్లో లేకపోవడం మేనకని ఓదార్చేవార్రే లేకపోయారు!

ఆ ఆఫీసరుగారు ఎప్పుడెప్పుడు తిరిగొస్తారా, ఎప్పుడెప్పుడు జరిగినదంతా అతనితో చెప్పి మహమూద్‌నీ, తనని చూసి నవ్వినవాళ్లనీ చివాట్లు పెట్టించి సంతోషిద్దామా అని ఎదురు చూసిన మేనకకి చెప్పలేనంత నిరుత్సాహం ఆవరించేసింది. ఆ వార్త విన్నాక! ఆ ఆఫీసరుగారికి ట్రాన్స్‌ఫర్ అయిపోయింది. అతనింకరాడు" అతని స్థానంలో చక్రవర్తి అనే ఒక కొత్త ఆఫీసరొచ్చాట్ట!" అంది మైథిలి!

చక్రవర్తి చాలా 'స్ట్రిక్ట్' ఆఫీసరు. ప్రతివాళ్లూ టైముకి రావాలి, టైముకి పోవాలి. పనిలో ఆడా మగా తేడాలేదు అంటూ చక్రవర్తి ఇచ్చిన ఉపన్యాసానికి అందరూ చప్పట్లు కొట్టారు.

"కలకంఠి కన్నీరొలికిన" అన్న పద్యంలో ఆ ఇంట సిరి నిలవదు, ఆ ఇల్లాలు కన్నీళ్లు పెడితే అన్నారు కానీ ఏసుపాదం ఆడవాళ్లు ఆఫీసులో కన్నీళ్లు పెడితే ఆమె టేబుల్ మీద ఫైళ్లు నిలవవురా అంటే ఎవరూ ఫైళ్లు ఆమెకి

పంపరు. అన్న అమర్‌నాథ్ మాటలు అబద్ధాలయ్యాయి.

చక్రవర్తిగారొచ్చాక! మేనక కన్నీళ్ళు బందయ్యాయి. పాపం మేనక చీటికీ మాటికీ ఏడిస్తే ఓదార్చే వాళ్లు లేక ఏడుపు మనేసింది!

"అస్తమానం అయినదానికీ కానిదానికి కళ్లనీళ్లు పెట్టుకుని ఏడవడం మంచిది కాదు. మనపని మనం చేసుకొని ఎవ్వరి జోలికీపోక ఎవ్వరూ అనవసరంగా మన జోలికి రాకుండా చూసుకుంటూ ఆడవాళ్లూ అన్నిపనుల్లో సమర్థులు అనిపించుకోవడం ఎంతో అవసరం, గౌరవం కూడా" అంది మైథిలి!

"అవును మైథిలీ! నువ్వు చెప్పింది నిజం! నేనెంత పిచ్చిగా ప్రవర్తించానో తలుచుకుంటే నాకే సిగ్గేస్తుంది" అంది మేనక గతాన్ని తలుచుకుని బాధపడుతూ!

అందరూ ఆడవాళ్లు కూడా కన్నీళ్లని విరివిగా వాడక కన్నీరు కురిపించి పన్లు చేయించుకునే పాత పద్ధతి మాని కష్టపడి పనిచెయ్యడం నేర్చుకుంటే వాళ్లకీ దేశానికీ అందరికీ మంచిది. ఏమంటారు?

*